# పెద్ద, బాల, శిక్ష

ఏవితల్లీ నిరుడు కురిసిన బాల్యహిమ సమూహములు?

బాల్యం అంటే తెల్లతెల్లని వెన్న ముద్దల బంగారు కొండ కదూ!

బాల్యం అంటే పడిలేచే చల్లచల్లని నీటితుంపరల సాగర కెరటం కదూ!

బాల్యం అంటే వెచ్చవెచ్చని నునులేత సూర్యకిరణం కదూ!

బాల్యం అంటే పచ్చపచ్చని చిరురెమ్మల పైరు కదూ!

బాల్యం అంటే తీయతీయగ కురిసే వెండి వెన్నెల కాంతి కదూ!

బాల్యం అంటే హాయి హాయిగ వీచే పిల్ల తెమ్మెర కదూ!

ఏవి తండ్రీ నాడు విరిసిన సౌకుమార్యపు సుగంధ పరిమళ మమతానురాగాల పువ్వులు?




తల్లి సుభద్ర కడుపులో ఉండి పద్మవ్యూహ రహస్యాలను విని, గుర్తించుకున్న మేధస్సు కదూ బాల్యం అంటే!

కాళీయ మర్దన చేసిన, పూతన రాకాసికోరలు విరిచిన చిన్ని కృష్ణుని వీరత్వం కదూ బాల్యం అంటే!

తాటకి దుశ్చర్యల్ని ఒకే బాణంతో తెగ నరికిన ధీరత్వం కదూ బాల్యం అంటే!

ఏమిటి, ఎందుకు వంటి ప్రశ్నల పరంపర కదూ బాల్యం అంటే!

పెరుగన్నం గోరుముద్దలు అమ్మచేత బతిమాలించుకుని, బతి మాలించుకుని కొసరి కొసరి తినిపించుకోవడం కదూ బాల్యం అంటే!

తప్పటడుగులు వేస్తూ తనెక్కడ పడిపోతాడోనని తల్లి భయపడ్డం చూసి బోసి నవ్వులు రువ్వడం కదూ బాల్యం అంటే-

అమ్మమ్మ చుట్టూనో, తాతయ్య చుట్టూనో తిరిగి తిరిగి, కథలు చెప్పమని అడిగి అడిగి, తీరా చెబుతుంటే 'ఊ' కొడుతూ 'ఊ' కొడుతూనే మెల్లగా నిద్రలోకి జారిపోవడం కదూ బాల్యం అంటే!

జడివాన పడిన ఒకనాడు స్కూలుకు సెలవిచ్చారని, చిరుజల్లు పడినా 'వానపడుతోందమ్మా, వాన పడుతోంది నాన్నా' అంటూ పదే పదే పరోక్షంగా 'సెలవు'ను ప్రస్తావించడం కదూ బాల్యం అంటే-

బాల్యం అంటే వెలుగు మువ్వలరవ్వలేనా? అటువైపు బాల్యం తేనె చుక్కల చప్పరింపే! మేనుకందని నీడ బతుకే! కష్టమెరుగని కనక మేడల పవ్వళింపే!

ఇటు వైపు బాల్యం అంటే చిరుగు బతుకుల చీకటి పాట కూడా కదూ!

బాల్యం అంటే కరుగు కండల రోకటి పోటు కూడా కదూ!

బాల్యం అంటే మోయజాలని ఇటుక, పెంకుల బట్టీ కూడా కదూ!

బాల్యం అంటే పొట్టకూటికి వెట్టి చాకిరి కూడా కదూ!

బాల్యం అంటే చిరుతిళ్లు ఎరుగని బండరాయిల మోత కూడా కదూ!

మరి, ఆమూల అదేమిటా వింత పుంతల బాల రాక్షస పెను అడుగుల జాడలు?!

ఇదేవిటి తల్లీ, వికృత ఆలోచనల వినూత్న భయంకర ఊడలు?!

ఆటలాడు వయసులో చదువు సంధ్యల బాటలో పెచ్చు పెరిగిన బ్రహ్మజెముడు డొంకలు!

స్నేహ మాధుర్యం వట్టి పోయిన, మానవత్వం ఇంకిపోయిన వాగులూ, వంకలు!

పన్నెండేళ్ళ ప్రాయంలో జేబులు కొట్టే చిరుచేతులు!

పధ్నాలుగేళ్ళ వయసులో గంజాయి పీల్చే ఎఱ్ఱ పెదవులు!

పదహారేళ్ళ వయసులో రాతల కలం పట్టాల్సిన చేతిలో కత్తుల కోతలు!

ఇదేవిటి తండ్రీ మానవత్వం హరించిన, దానవత్వం హసించిన మానభంగపు మచ్చలు!

పన్నెండేళ్ళ అవనిగడ్డ జ్యోతిపై పదహారేళ్ళ బాలా శ్రీనివాస్‌కు కామ ప్రలోభం... వాడి నీచపు ఆలోచన్లకు పదిహేనేళ్ళ అన్నపురెడ్డి లోకేశ్వర్, పధ్నాలుగేళ్ల అమర్‌ల అండదండల చీడ... నైతిక విలువల జ్ఞానం లేని వికారపు మొండి గోడ!

ఆ బాల కీచకులకు చట్టం భీముడు శిక్ష విధించకమానడు. నేరం చేసిన వాళ్లు కఠిన శిక్ష అనుభవించక తప్పదు. అయితే, ఆ నేరం చేసింది వాళ్లేనా? శిక్ష అనుభవించాల్సింది వాళ్ళేనా?

అసలు నేరం వాళ్ళదేనా? ఆ ఘోరానికి బాధ్యత వాళ్ళదేనా?

అవును...... కాదు........ ముందుగా శిక్షించాల్సింది వాళ్ళను కాదు...

జ్యోతిష్యం పైనా, పంచాంగం పైనా బతుకుతూ, వాటిపై తన కొడుకు బాలా శ్రీనివాస్‌కి విశ్వాసం కలిగించిన ఆ తండ్రికి శిక్ష విధించాలి. ఏరోజున ఎవరికి సంభోగయోగం ఉందో, శ్మశాన యోగం ఉందో నోటికొచ్చింది రాసి, అచ్చేసిన ఆ పంచాంగకర్తని శిక్షించాలి.

సెక్స్, బీభత్స, హింసాత్మక చిత్రాలను తీసిన, పుస్తకాల్లో రాసిన వాళ్ళను శిక్షించాలి. వాటిని సిన్మాహాళ్లలో, టీవీల్లో చూపిస్తున్న వాళ్ళను శిక్షించాలి.

తన టీవీని తన పిల్లల్ని చూడనివ్వనని చెప్పిన, మిగతా బాల ప్రపంచం ఏమై పోయినా ఫర్వా లేదనుకుంటూ కోట్లు గడిస్తున్న స్టార్ టీవీ అధినేతలాంటి వాళ్ళనందర్నీ శిక్షించాలి.

ఆ ముగ్గురి కుర్రాళ్ళకూ చదువులు చెప్పిన టీచర్లను శిక్షించాలి.అలా పెంచిన తల్లిదండ్రులను శిక్షించాలి. బాల ప్రపంచాన్ని భక్షిస్తున్న పెద్దవాళ్ళనే తప్పనిసరిగా ముందుగా శిక్షించాలి.

అదే న్యాయం, అదే ధర్మం.

12.7.96.

వార్త దినపత్రిక,